# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | గురువారం 25 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


# దేవుడి పేరుతో బీజేపీ రాజకీయాలు

### మడికొండ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, కావ్య

మడికొండ, ఏప్రిల్ 24 : బీజేపీ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నదని, దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా మడికొండలో ఏర్పాటుచేసిన ఓరుగల్లు జనజాతర సభకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బీజేపీకి ఓటేయొద్దని, ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపిస్తే అందరి భూములను కబ్జా చేస్తారని ఆరోపించారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను విస్మరించిందన్నారు. 20 కోట్ల ఉద్యోగాలను ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. ఐదేళ్లలో ఆరు గ్యారెంటీలతో పాటు మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను అమలుచేసి తీరుతామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గిరిజన శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రతి వస్తువుపై జీఎస్టీ విధిస్తున్నారని చెప్పారు. వేసుకునే బట్టలు, కిరాణా వస్తువులు, ఆఖరికి శవాలపై కూడా పన్నులు వేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. దోస్తులకు దోచిపెట్టిన చరిత్ర బీజేపీకే దక్కుతుందన్నారు. బీజేపీ దోపిడీ దొంగల ప్రభుత్వమని, కులాలు, మతాల మధ్య పంచాయితీలు పెడుతున్నదన్నారు. అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో భూకబ్జాలకు పాల్పడిన బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కన్ను ఇప్పుడు ఇతర నియోజకవర్గాలపై పడిందన్నారు. సభలో ఏఐసీసీ జాతీయ కార్యదర్శి రోహిత్ చౌదరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మామిడాల యశస్వినీరెడ్డి, ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కాంగ్రెస్ నేతలు నమిండ్ల శ్రీను, ఖుస్రూపాషా, ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వర్‌రావు, ఈవీ శ్రీనివాస్, పెరుమాండ్ల రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### సీఎం మాట్లాడుతుండగానే..

మడికొండ సభలో సీఎం మాట్లాడుతుండగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వెళ్లిపోయారు. రేవంత్‌రెడ్డి మాట్లాడాల్సి ఉండగానే కుర్చీలు ఖాళీ అయ్యాయి. అలాగే మడికొండ చౌరస్తాలో హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను ధర్మసాగర్ వైపు ట్రాఫిక్ పోలీసులు మళ్లించారు. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటికే మళ్లీ వాహనాలను యథావిధిగా పంపారు.



కేసీఆర్ రోడ్ షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

# కేసీఆర్ రోడ్ షో ఏర్పాట్ల పరిశీలన

### 28న వరంగల్‌కు బీఆర్ఎస్ అధినేత

### సభా స్థలాలను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 28న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వరంగల్‌లో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్, పెట్రోల్ పంప్ జంక్షన్, హనుమకొండ చౌరస్తాలో స్థలాలను పరిశీలించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, బొల్లం సంపత్‌కుమార్, మెట్టు శ్రీనివాస్, వాసుదేవారెడ్డి, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి పాల్గొన్నారు.

# ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య



అశ్విని, చిప్ప భార్గవి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్, ఏప్రిల్ 24: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన నేతి యాకయ్య-యాకమ్మల కూతురు అశ్విని(17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీఈసీలో ప్రథమ సంవత్సరం చదువుతున్నది. కామర్స్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. డోర్నకల్ మండలం చిల్కోడుకు చెందిన చిప్ప గణేశ్-స్వాతిల కూతురు భార్గవి(17) వరంగల్ జిల్లా ఆరెపల్లి సమీపంలోని ఇంటర్మీడియట్ గురుకులంలో బైపీసీ ఫస్టియర్ చదువుతోంది. బోటనీ సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.



తొర్రూరులో సమావేశ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# నేడు తొర్రూరుకు హరీశ్‌రావు రాక

### బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ సమావేశం

### ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం పాలకుర్తి నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని తొర్రూరులో నిర్వహించనున్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి స్థానిక పీఎస్ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సమీపంలోని స్థలంలో ఏర్పాట్లను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన సుమారు 5వేల మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, పార్టీ ముఖ్య శ్రేణులు సకాలంలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తోపాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు. జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నియోజకవర్గ నాయకులు డాక్టర్ పి.సోమేశ్వర్‌రావు, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, ధరావత్ జైసింగ్‌నాయక్, రాయిశెట్టి వెంకన్న, ఉపేందర్, జాటోత్ సురేశ్ పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

# ఇంటర్‌లో శివాని ప్రభంజనం

హసన్‌పర్తి, ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్-2024 ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో చీర్ల సైజా 468/470, మేడిశెట్టి యశ్వంత్ 467, వేల్పుల అజయ్ 467, పూజారి జెమిని, కొత్తకొండ అక్షయ 467, గుగులోత్ తరుణ్ 467 మార్కులు సాధించారు. బైపీసీలో మూడు సుస్మిత 436/440, గుండా అన్సికా 436, కడారి కౌశిక్ 435, ఆరె హాసిని, హనుమకొండ శివాని 435, కుమ్మరికుంట్ల జోతిర్మయి 435 మార్కులు సాధించారు. అలాగే, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో పెసల చైతన్య 989/1000, తిప్పారపు గణేశ్ 989, రావెల నందిని 989, వెల్దండి హారిక 988, దాసరి శ్వేత 988 మార్కులు సాధించారు. బైపీసీలో కంకటి హారిక 981/1000, బక్క సింధూజ 980 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ టీ స్వామి, ప్రిన్సిపాళ్లు జీ సురేందర్‌రెడ్డి, వీ చంద్రమోహన్, డైరెక్టర్ టీ రాజు, ఎన్.రమేశ్, ఏ మురళి, వీ సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.








